క్లుప్తంగా

జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక



ఎంపికైన పురుషుల జిల్లా కబడ్డీ జట్టు

కామవరపుకోట: జిల్లా పురుషుల సీనియర్ కబడ్డీ జట్టు ఎంపికైనట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ సీహెచ్ రాజు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహించామని, ఇక్కడ ఎంపికైన జట్టు త్వరలో నెల్లూరు జిల్లా కొవ్వూరులో నిర్వహించే పురుషుల సీనియర్ కబడ్డీ టోర్నమెంట్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలో కబడ్డీ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.శ్యామలాదేవి, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.జయరాజు, పీడీ తూంపాటి బాబురావు, అథ్లెట్ ఎం.రాజు పాల్గొన్నారు.

బీసీలకు అండగా నిలిచే పార్టీని గెలిపించుకోవాలి



వీరవరపు నివాస్‌ను సన్మానిస్తున్న శాలివాహన సంఘ సభ్యులు

కొయ్యలగూడెం: బీసీలకు వెన్నుదన్నుగా నిలిచే పార్టీని వచ్చే ఎన్నికలలో శాలివాహన సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని శాలివాహన సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు వీరవరపు నివాస్ పిలుపునిచ్చారు. కొయ్యలగూడెంలో శనివారం నిర్వహించిన మండల శాలివాహన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వీరవరపు నివాస్‌ని ఘనంగా సత్కరించారు. పసివేతల తాతారావు, గొలిసెట్టి సత్యనారాయణ, ఆదుర్తి (పాలి) శ్రీను, గొలిశెట్టి శ్రీనివాసరావు, గొలిశెట్టి ప్రసాదు, గొలిశెట్టి వాసు, నిడదవోలు శ్రీను, సూరిబాబు, గణేష్, పాండు రంగారావు, దేవగుప్తాపు నాగరాజు, మురళి, నాగేశ్వరరావు, శ్రీకాకుళపు ప్రసాదు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

చింతలపూడి: ఈ నెల 9వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్‌అదాలత్‌ను 16వ తేదీకి మార్పు చేసినట్లు జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు తెలిపారు. శనివారం స్థానిక కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్, మున్సిపాలిటీ పన్ను బకాయి కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. వివరాలకు దగ్గరలోఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: అధిక కట్నం కోసం భర్త, అతని కుటుంబ సభ్యులు మానసికంగా, శారీరికంగా వేధిస్తున్నారని వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.జ్యోతిబాస్ తెలిపారు. వివరాల ప్రకారం చల్లవారిగూడానికి చెందిన దుర్గకు సీహెచ్ వెంకటేశ్వరరావుతో 2021లో వివాహమైంది. ఆ సమయంలో కట్నం కింద రూ. 2 లక్షలు నగదు, ఇంటి సామాగ్రి ఇచ్చారు. వారిద్దరికి ఒక పాప పుట్టిన తరువాత భర్త తన కుటుంబ సభ్యులు కలిసి అధిక కట్నం కోసం వేధిస్తున్నారని దుర్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైర్ల చోరీ

జంగారెడ్డిగూడెం: వేగవరం పంచాయతీ రామచర్లగూడెం పరిధిలోని పొలాల్లో ముగ్గురు రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైర్లు చోరీకి గురైనట్లు స్టేషన్ రైటర్ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొణతం వెంకట రామనరసింహారావు, కొంకిమళ్ళ గంగాధరరావు, బి.శ్రీనివాసరావు అనే రైతులకు చెందిన 40కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు రాగి వైర్లు చోరీ చేశారన్నారు. దీనిపై ఏఈ ఎస్.శ్రీనివాసులు ఇచ్చినఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



అన్నపనేనివారిగూడెంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం: అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని అన్నపనేనివారిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి నాబార్డు నిధులు రూ.76 లక్షలతో నిర్మించే పనులకు ఎలీజా శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్డిగర్ల రవీంద్ర, జెడ్పీటీసీ వడ్లాని హరినాథరాజు, వైఎస్సార్‌సీపీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు మందలపు నరసింహరావు, ముత్యాల రాధాకృష్ణ, కుప్పాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన సొంతింటి కల

- లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారులు



చింతలపూడి: ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



కామవరపుకోట: తడికలపూడిలో జగనన్న ఇంటి పట్టాల పంపిణీ



జంగారెడ్డిగూడెం: రిజిస్ట్రేషన్ పట్టాలను అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి



జంగారెడ్డిగూడెం రూరల్: నాగులగూడెంలో పట్టాలు అందుకున్న లబ్ధిదారులు

జంగారెడ్డిగూడెం: పేదవాడి సొంతింటి కలను నెరవేర్చుతానని నాడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెంలో పేదలకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బత్తిన లక్ష్మి మాట్లాడుతూ పేదవారు తాము సంపాదించుకున్న దానిలో సగానికి పైగా అద్దెలు చెల్లించుకోవడానికే ఖర్చుచేస్తున్నారన్నారు. ఇది గమనించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సమయంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకాన్ని రూపొందించి తాను అధికారంలోకి వస్తే ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చుతానని హామీ ఇచ్చారు. అన్న మాటను నిజం చేస్తూ అధికారంలోకి రాగానే పేదలకు 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను అందించి, వారు ఇళ్లు కట్టుకునేందుకు రూ. 1.80 లక్షలు ప్రభుత్వం ద్వారా అందించారన్నారు. అలాగే మరో రూ.35 వేలు డ్వాక్రా సంఘాల మహిళలకు సున్నా వడ్డీ ద్వారా కల్పించారన్నారు. ఇప్పటికే లక్షలాది మంది సొంత ఇంటిలో నివాసం ఉంటున్నారని, చాలా గృహాలు వివిధ స్థాయిల్లో నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోనే 2వేలకు పైగా జగనన్న ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు రాబోయే రోజుల్లో ఇలానే సంక్షేమం అందాలంటే త్వరలో జగరనున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, కౌన్సిలర్ పీపీఎన్ చంద్రరావు, నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్, బత్తిన చిన్న, ఏఎంసీ వైస్‌చైర్మన్ తాతకుంట్ల రవికుమార్, గూడపాటి రాధాకృష్ణ, మున్సిపల్ మేనేజర్ కేవీ రమణ, డిప్యూటీ తహసీల్దార్ ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలి

చింతలపూడి: ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నిజం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ డా బి రాంబాబు నాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 12 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజా సుధాకర్ మాట్లాడుతూ చంద్రబాబు నిర్వాకం వల్ల నిరుపేదలు ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. టీడీపీ నాయకులు కోర్టులో కేసులు వేయడం వల్ల ఇళ్ల పట్టాల పంపిణీ ఆలస్యమైందని, కోర్టులో కేసులు పరిష్కారం అయ్యాక లబ్ధిదారులకు జగనన్న యుద్ధ ప్రాతిపదికన పట్టాలు పంపిణీ చేశారని చెప్పారు. వైఎస్ జగన్‌ను మళ్ళీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మహిళలపైనే ఉందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గంధం రామ్మోహన్‌రావు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎం.దుర్గారావు, సర్పంచ్‌లు తాంద్ర రామకృష్ణారావు, ఆర్‌వీ రామారావు, యడ్ల మోహన్‌రావు, టి భూపతి, జి రాజేష్‌నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తడికలపూడిలో ఇళ్ల పట్టాల పంపిణీ

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సొంతింటి కల నెరవేరిందని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. తడికలపూడి గ్రామంలో శనివారం లబ్ధిదారులకు జగనన్న ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమేష్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన పేదలకు ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టి పేదల సొంతింటి కల నెరవేర్చారన్నారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఎంపీటీసీ గంగుల కడియాలు, సొసైటీ అధ్యక్షుడు గంగుల కాశీ, ఉప సర్పంచ్ కోలా విష్ణు, సిరిగిబత్తుల రాంబాబు, దారం మురళి, లక్ష్మినారాయణ, సెక్రటరీ సత్యనారాయణ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నాగులగూడెంలో...

జంగారెడ్డిగూడెం రూరల్: నాగులగూడెంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. సర్పంచ్ గుబ్బల సత్యవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోలి ప్రసాద్‌రెడ్డి, కొయ్య లీలాధరరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



దరఖాస్తు చేసిన వెంటనే ఇంటి జాగా మంజూరు చేయడం సంతోషంగా ఉంది. ఈ రోజుల్లో స్థలం కొనుక్కుని ఇల్లు కట్టుకోవడం చాలా కష్టం. అటువంటిది ఇంటి పట్టాతో పాటు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– గుద్దేటి రమ్య, వెంకటాద్రిగూడెం

గతంలో కాళ్లరిగేలా తిరిగాం..



గతంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసి అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగానా ఫలితం దక్కలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ ద్వారా దరఖాస్తు చేశాక ఇంటి స్థలం మంజూరైంది. రూపాయి లంచం ఇవ్వకుండా పట్టా అందజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మా మద్దతు ఇస్తాం. మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

– ఉలవల రాణి, సుప్రింపేట

మల్లన్న సేవలో...



శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలు, పండ్లను సమర్పిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామివారి ఆలయాన్ని చినవెంకన్న దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న వారు ముందుగా స్వామి, అమ్మవార్లకు శ్రీవారి దేవస్థానం తరుపున పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమలను సమర్పించారు. అనంతరం శివయ్య స్పర్శ దర్శనాన్ని చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు పెద్దిరెడ్డి పద్మజ్యోతి శ్రీనివాస్, ఆచంట అనసూయ సురేష్, మానుకొండ సుబ్బారావు, పాలా వెంకటేశ్వరరావు, తొమ్మండ్రు రమేష్, తాతా శ్రీనివాస్, శ్రీవారి దేవస్థానం ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ రమణరాజు, డీఈ సూర్యనారాయణ, అర్చకులు, పండితులు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎ.అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శనివారం ఆయన విలేకరులకు తెలిపారు. పట్టణంలోని దళితవాడ, డాంగేనగర్ యూపీహెచ్‌సీల పరిధిలో 4703 చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. పట్టణంలో మొత్తం 50 బృందాలను ఏర్పాటుచేశామని, 100మంది సిబ్బందిని నియమించామన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు.

బుట్టాయగూడెం: పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ శనివారం దొరమామిడి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు నందిని, గణేష్ మాట్లాడుతూ ఆదివారం పల్స్ పోలియో కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. మిగిలిన వారికి 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియోచుక్కలు అందిస్తామన్నారు. దొరమామిడి ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో మొత్తం 690 మంది పిల్లలు ఉన్నారని, వారందరికీ పోలియో చుక్కలు వేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య, ఆరోగ్యశాఖల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ర్యాలీలు, మానవహారాలు, అవగాహన కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. పరింపూడి ఎంపీపీ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. అదేవిధంగా బయ్యనగూడెంలో పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ నిర్వహించి ప్రజలలో పోలియో చుక్కలపై అవగాహన కల్పించారు. ఎంపిక చేసిన అన్ని కేంద్రాల వద్ద ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పల్స్ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని వైద్యాధికారులు పేర్కొన్నారు.

స్థల దాతలకు సత్కారం



దొరమామిడిలో స్థల దాతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

బుట్టాయగూడెం: దొరమామిడిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణాలకు స్థలం దానం చేసిన కీర్తిశేషులు మద్దిపాటి నాగేశ్వరరావు, జయలక్ష్మి దంపతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసిన పార్టీ నాయకులు, కాంట్రాక్టర్ చింతలపూడి వెంకటనారాయణ, గ్రామపెద్దలు పోలిన సుబ్రహ్మణ్యం, అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా నిలిచిన సర్పంచ్ తెల్లం రాముడుని సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్‌లు మడకం రామలక్ష్మి, పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, కొవ్వాసి నారాయణ, కాలింగి వెంకటేశ్వరరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్రీను, పంచాయతీ కార్యదర్శి ముప్పిడి బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభం



కన్నాపురంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు, ఎమ్మెల్యే బాలరాజుకు మంగళహారతులు పడుతున్న మహిళలు

కొయ్యలగూడెం: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్ సీపీ సార్వత్రిక ఎన్నికల ప్రచారం కన్నాపురంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిలకు మహిళలు మంగళహారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. 200కు పైగా మోటార్ బైకులు, 50కి పైగా కార్లతో భారీ కాన్వాయ్ ర్యాలీ పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచింది. ఏజెన్సీ ముఖద్వారానికి రాజకీయ కేంద్రమైన కొయ్యలగూడెం మండలంలో ప్రచారం ప్రారంభించడం కలిసి వస్తున్న అంశం అనీ, మహానేత వైఎస్సార్, యువనేత జగన్ కూడా పోలవరం నియోజకవర్గ పరిధిలో కొయ్యలగూడెం నుంచే తొలి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే బాలరాజు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న బాలరాజు నేతృత్వంలో అక్క రాజ్యలక్ష్మి తాను ప్రజాసేవకు పునరంకితమవుతామని, తన తండ్రి కారుమూరి నాగేశ్వరరావుతో ఈ ప్రాంత వాసులకు పరిచయాలు ఎక్కువగా ఉండడం తనకు లాభిస్తుందని ఎంపీ అభ్యర్థి సునీల్ అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓట్లు వేసి రుణం తీర్చుకోవడానికి రైతన్నలు, మహిళా తోబుట్టువులు ఎంతో ఉత్సాహంతో ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. కన్నాపురం గణేష్ సెంటర్లో, విజయలక్ష్మి, కనకదుర్గమ్మ ఆలయాలలో పూజలు ప్రారంభించిన అనంతరం ముగ్గురు నేతలు దుకాణదారుల వద్దకు వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. అదే సమయంలో ప్రత్యర్థి పార్టీల వారు అధికారంలోకి వస్తే ఏర్పడే దుష్పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ ఆరేటి శాంతకుమారి, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొండపల్లి శివాజీ, సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము, సర్పంచ్ ఉప్పల పద్మావతి, డాక్టర్ ఉండుర్తి శ్రీను, ఉపసర్పంచ్ ఎండీ ముంతాజ్ బేగం, కాటుబోయిన సురేష్, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు యడ్లపల్లి సురేష్, సొంగా రాకేష్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అర్హులకు సంక్షేమ లబ్ధి

- అభివృద్ధి పనులతో మారిన గ్రామాల స్వరూపాలు
- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి



పులిరామన్నగూడెంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు నేరుగా అందుతున్నాయని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని మారుమూల గ్రామమైన పీఆర్‌గూడెంలో వారు రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో పలు సీసీ రోడ్లను ప్రారంభించడంతోపాటు పలు సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కేఆర్‌పురం సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రాన్ని, దొరమామిడిలో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి.. ప్రభుత్వ సేవల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు లేకుండా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. అలాగే వచ్చే ఎన్నికల్లో పోలవరం ఎమ్మెల్యేగా తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు ఎంపీగా కారుమూరి సునీల్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే బాలరాజు కోరారు.

పేదలకు పట్టాల పంపిణీ

బుట్టాయగూడెం–2 తాట్కూరుగొమ్ము ఆర్అండ్ఆర్ కాలనీ సచివాలయం వద్ద ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి చేతుల మీదుగా ఇళ్ల లబ్ధిదారులకు శనివారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మండలంలో 303 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు చెప్పారు.

కేన్సర్ రోగికి ఆర్థిక సహాయం అందజేత

రాజానగరం సచివాలయ కన్వీనర్ రమణానాగు భార్య సుజాత గత కొద్దికాలంగా బ్రెయిన్ కేన్సర్‌తో బాధపడుతోంది. ఆమెను శనివారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు పరామర్శించారు. ఈ సందర్భంగా సుజాత వైద్యానికి టీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో రూ. 20 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్‌లు కుంజా దుర్గమ్మ, ఉయికే బొజ్జి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, ఎంపీటీసీ గాలి దుర్గారావు, పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, కొవ్వాసి నారాయణ, కుంజా ప్రసాద్, కపిలవాయి హరిసూర్యనారాయణ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యకు చెక్

- పలు చోట్ల నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- సబ్ డివిజన్‌కు రూ.కోటి మంజూరు చేసిన ప్రభుత్వం



జంగారెడ్డిగూడెంలోని సూరపురాజు కాలనీలో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్

జంగారెడ్డిగూడెం: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ వేసవి కాలంలో ఎటువంటి విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో ఆమేరకు అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడ సమస్యలు ఉన్నాయో ముందుగా గుర్తించి ఆయా ప్రాంతాల్లో సమస్యలు తీర్చేలా పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా లోవోల్టేజ్ సమస్యలు రాకుండా పనులు చేస్తున్నారు. విద్యుత్ కండక్టర్లు మార్చడం, ట్రాన్స్‌ఫార్మర్లు కెపాసిటీ పెంచడం వంటి పనులు చేపడుతున్నారు. ఈమేరకు జంగారెడ్డిగూడెం విద్యుత్ సబ్ డివిజన్‌లో విద్యుత్ శాఖాధికారులు ముమ్మరంగా పనులు చేపడుతున్నారు. ఎక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో ముందుగానే విద్యుత్ వినియోగదారులకు సమాచారం ఇచ్చి సమస్యలు పరిష్కరించే పనులు నిర్వహిస్తున్నారు. డివిజన్ పరిధిలో ఆయా ప్రాంతాల్లో వారంలో ఒక రోజు ఈ పనులు చేపడుతున్నారు. వ్యవసాయానికి గాని, వ్యాపారాలకు గాని, గృహ వినియోగదారులకు గాని ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు నిర్వహిస్తున్నారు.

రూ.కోటితో ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు

వేసవిలో విద్యుత్ సమస్యలు రాకుండా చేపట్టాల్సిన పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్‌కు రూ.కోటి మంజూరు చేయగా ఆ నిధులతో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు విద్యుత్ శాఖాధికారులు నిర్వహిస్తున్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి, 40 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు – 3, 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు – 2 మొత్తం 6 ఏర్పాటు చేశారు. అలాగే చింతలపూడిలో 12 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు – 2, 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు – 1, 17 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు – 5, కొయ్యలగూడెంలో 12 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు – 2, 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు – 2, పోలవరంలో 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు – 5, కామవరపుకోటలో 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు – 6 ఏర్పాటు చేశారు. అలాగే గ్రామీణ ప్రాంత గ్రామాల్లో 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 16 ఏర్పాటు చేశారు. మొత్తం రూ.కోటి విలువైన 45 ట్రాన్స్‌ఫార్మర్లను డివిజన్ పరిధిలో విద్యుత్ శాఖాధికారులు ఏర్పాటు చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో లోవోల్టేజ్ సమస్యను తీర్చుతాం. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సమస్యలు తీర్చేందుకు రూ.కోటి మంజూరు చేసింది. ఈ నిధులతో డివిజన్ పరిధిలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ క్రమంలో ఇప్పటివరకు 45 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. ప్రజలు సైతం వారి ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తా

– పి.రాధాకృష్ణ, ఈఈ, ఏపీఈపీడీసీఎల్, జంగారెడ్డిగూడెం డివిజన్